బూదవాడ మారింది

- ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- నవరత్నాలతో ప్రతి ఇంటికి లబ్ధి
- పథకాల ద్వారా గ్రామస్తులకు 25.92కోట్ల మేర లబ్ధి
- ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



బూదవాడలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయం


రూ.కోటితో తిపురవరం నుంచి రెడ్డినాయకతండా వరకు నిర్మించిన బీటీ రోడ్డు

ఇది కదా.. అభివృద్ధి

బూదవాడ(జగ్గయ్యపేట): ఊరు జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ..అది 2014–19 చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వ పాలనా కాలం..బూదవాడలో ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పాత గ్రామపంచాయితీ కార్యాలయం..అరకొర సౌకర్యాలు..పరిపాలనకు ఇబ్బందికర పరిస్థితులు, రైతులు పండించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు సౌకర్యాలు లేని దుస్థితి..ఏది కావాలన్నా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న జగ్గయ్యపేటకు పరుగులు తీయక తప్పని పరిస్థితి..ప్రభుత్వ పథకం అందాలంటే జన్మభూమి కమిటీల పైరవీలు..పింఛన్ కావాలంటే లబ్ధిదారుల్లో ఒకరు మృతిచెందితే తప్ప అందని దౌర్భాగ్య స్థితి..టీడీపీ నాయకుల ఆజ్ఞ లేనిదే సంబంధిత కార్యాలయాల్లో ఏపని జరగని వైనం. అటువంటి దుర్మార్గ పాలనకు చరమగీతం పాడుతూ 2019 మే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడింది.. ఈ ప్రభుత్వ హయాంలో బూదవాడకు సరికొత్త హంగులతో గ్రామసచివాలయం వచ్చింది..గ్రామంలోని ప్రధానసెంటర్‌లో నూతన ప్రభుత్వ భవనాలు ఏర్పాటయ్యాయి.. అర్హతే ప్రామాణికంగా అన్ని ప్రభుత్వ పథకాలు వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్లముంగిటేనే అందుతున్నాయి..ఏపని కావాలన్నా నేరుగా అధికారులను కలిసే అవకాశం దక్కింది..విద్య, వైద్య, వ్యవసాయరంగాల్లో మెరుగైన సేవలు అందిచేందుకు సచివాలయ సిబ్బంది అందుబాటులోకి వచ్చారు..ఇలా ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో బూదవాడ గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పనులకు రూ.36.61కోట్ల వరకు ఖర్చుచేసి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నిలిపారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఈ గ్రామాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించి గ్రామంలో మౌలికవసతుల కల్పనకు కృషిచేశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ఆయా ప్రభుత్వ పథకాలను అందించారు.

6200 జనాభా..ఎస్టీ, బీసీలే అధికం..

బూదవాడ గ్రామ జనాభా 6200 ఉండగా, ఓటర్లు 4వేల మంది వరకు ఉన్నారు.
ఈ గ్రామం తెలంగాణ రాష్ట్ర సరిహద్దుకు కూతవేటు దూరంలో ఉంటుంది. ఈ గ్రామానికి రెడ్డినాయక్ తండా, త్రిపురవరం శివారు గ్రామాలుగా ఉన్నాయి. గ్రామజనాభాలో అత్యధికులు ఎస్టీలు, బీసీలే. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో చెప్పుకోదగ్గ పని ఒక్కటీ జరగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. భావి తరాలు గుర్తించేలా పనులు చేపట్టారు.

రూ.2.59కోట్లతో అభివృద్ధి పనులు..

ప్రభుత్వం వచ్చిన నాటినుంచి నేటి వరకు గ్రామంలో రూ.2.60కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. మనబడి నాడు–నేడు పథకం కింద గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల, శివారుగ్రామం రెడ్డినాయకతండాలోని పాఠశాలలను రూ.67లక్షలతో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, డెస్కటాప్‌లతో కూడిన బెంచీలు, మంచినీటి వసతి ఇలా అన్నిరకాల మౌలికవసతులు కల్పించారు. రూ.40లక్షలతో సచివాలయం నిర్మించారు. రూ.20.80లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.40లక్షలతో రైతుల కోసం బహుళ ప్రయోజన సౌకర్య గోదాము నిర్మించారు. రెడ్డినాయకతండాలో రూ.31లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయిన్స్ నిర్మాణం చేపట్టారు. రూ.1కోటితో తిపురవరం నుంచి రెడ్డినాయకతండా వరకు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించారు.

616 మందికి ఇళ్లస్థలాలు..

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద బూదవాడ గ్రామపరిధిలోని 616మంది పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేయడంతో తమ సొంతింటి కల నెరవేరిందని పేదలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు గృహనిర్మాణాలను పూర్తిచేసుకుని ఆయా ఇళ్లలో ఉంటుండగా, మరికొంతమంది చేపట్టిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

గ్రామస్తుల ఖాతాల్లో రూ.25.92కోట్లు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవరత్నాలు పథకాల కింద బూదవాడ గ్రామస్తులకు కోట్లాది రూపాయల మేర లబ్ధి చేకూరింది. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ బీమా, విద్యాదీవెన, విద్యావసతి, ఆసరా తదితర పథకాల ద్వారా ఈ ఐదేళ్లలో గ్రామానికి చెందిన 8011మంది లబ్ధిదారులకు డీబీటీ రూపంలో రూ.25.92కోట్ల మేర లబ్ధి చేకూరింది. నాన్‌డీబీటీ రూపంలో గ్రామస్తులకు రూ.8.09కోట్ల మేర మేలు జరిగింది. డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో రూ.34.01కోట్ల మేర లబ్ధిచేకూరింది. ఇలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బూదవాడ గ్రామం అభివృద్ధిపథంలో పయనిస్తోంది. ఈఐదేళ్లలో మునుపెన్నడూలేని అభివృద్ధిని చూశామని, అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలను అందించారంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాభివృద్ధికి కృషిచేసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సొంతింటి కల నిజం చేశారు...



మేము మొన్నటి వరకు అద్దె ఇంట్లో ఉండేవాళ్లం..నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వ ఆర్థికసాయం అందించడంతో ఇల్లు కట్టుకున్నాం.సొంతింట్లో ఆనందంగా ఉంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాసొంతింటి కలను సాకారం చేశారు. –బాణావత్ సంధ్య

గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీకాలనీలో మౌలిక సదుపాయాలతోపాటు సీసీరోడ్లు, డ్రైయినేజీలు నిర్మించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారు. సీఎం జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయం. –గుగులోతు శివ



రూ.20.80లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం


పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు


రూ.40లక్షలతో రైతుల కోసం నిర్మించిన గోడౌన్

క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీజయంతి ఉత్సవాలు

నందిగామ: మండలంలోని మాగల్లు వైకుంఠ నారాయణ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో లక్ష్మీజయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో స్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మంచి ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని వైద్యాధికారి పి.ఇందిర అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి మంచి పోషణ ఉంటుందన్నారు. బొప్పాయితో కంటికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా పెనుగంచిప్రోలులో కూడా ర్యాలీతోపాటు మానవ హారం ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీజగదాంబ(మేరీమా అమ్మవారు)ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు రామడుగు విక్రమాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం గం.8.34 నిముషాలకు ఆలయ, జగదాంబమాతతోపాటు గణపతి, పోతురాజు విగ్రహములు, శిఖర కలశము, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): చెక్‌పోస్టుల వద్ద నిఘాను ఉధృతం చేసినట్లు ఎస్ఐ మహాలక్ష్మ ఖుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెక్‌పోస్టు వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మద్యం, నగదు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు శనేశ్వరుడికి అభిషేకాలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో శనీశరస్వామి వారికి శనివారం ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం త్రయోదశి కలిసి రావడంతో ఉదయం ఆరు గంటల నుంచి అభిషేకాలు నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

పైపులైన్‌కు మరమ్మతులు



గండేపల్లి(కంచికచర్ల) : రానున్న వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మండలంలోని గండేపల్లి బీసీకాలనీలో రక్షిత మంచినీటి ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడంతో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరమ్మతులకు గురైన బోర్లను కూడా బాగు చేయిస్తున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో శనివారం ఎనిమిది గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. పెనుగంచిప్రోలులో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టినందున శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి


శనగపాడులో సమావేశంలో పాల్గొన్న నాగమణి, భాస్కరరావు, బూత్‌కమిటీ సభ్యులు

పెనుగంచిప్రోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు అన్నారు. మండలంలోని శనగపాడు, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్క కార్యకర్తపై ఉందన్నారు. అందరూ సమర్థవంతంగా పనిచేసి జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీగా కేశినేని నాని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో సర్పంచి కూచి నర్సయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, సొసైటీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, జక్కులూరి దేవదాసు, రాజారత్నం, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..
జగ్గయ్యపేట: మేం సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బలుసుపాడు, రెడ్డినాయక్‌తండా, గండ్రాయి గ్రామాల్లో శుక్రవారం బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు ప్రతిపక్ష పార్టీ ఇస్తున్న మోసపూరిత హామీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సయ్యద్ షాబుద్దీన్, సర్పంచులు సూర్యప్రకాశరావు, కొత్తపల్లి లూర్దుమేరి, బూత్ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, పి.రాము, వీరభద్రరావు


ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర మున్నేటి సమీపంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ తల్లి ఆలయం ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం కన్నులపండువగా సాగింది. వేద పండితుల ప్రత్యేకపూజలతో అమ్మవారి ఆలయం ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. యంత్ర ప్రతిష్ఠ, ముత్యాలమ్మ పోతురాజు, శిఖర, బలిపీఠ ప్రతిష్ఠ చేశారు. వేలాది మంది భక్తులు ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలు విజయవాడకు చెందిన ప్రత్తిపాటి సత్‌హితు, ప్రత్తిపాటి సోమదత్‌లను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. అనంతరం 5వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పరిటాల రాము, కమిటీ సభ్యులు యరగొర్ల రామకృష్ణ, ముక్కపాటి చినవెంకటేశ్వరరావు, ఆవుదొడ్డి నరసింహారావు, జిలుగు శ్రీనివాసరావు, కుక్కల శ్రీనివాసరావు, దర్శి కృష్ణ, చలమల స్వామి, వరదబోయిన నరసింహారావు, బడుగుల సురేష్, కూరాకుల సత్యనారాయణ, చెరుకుమల్లి నాగరాజు, వేముల మహాలక్ష్ముడు, షేక్ అమ్మీన్ సాహెబ్, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పంచభూతాలతోనే మానవ మనుగడ

సిద్ధార్థలో ఘనంగా ధరిత్రి దినోత్సవం


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వలనే మానవ మనుగడ సాధ్యమవుతోందని భారత ప్రభుత్వ జల వనరుల మంత్రిత్వ శాఖ జల్ జీవన్ మిషన్ ప్రతినిధి అంగద వరప్రసాదరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల గ్రీన్ క్లబ్, వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలోని సెమినార్‌హాలులో శుక్రవారం సభ జరిగింది. వరప్రసాదరావు మాట్లాడుతూ నీటి వనరులు లేకుండా భూమిపై మనిషికే కాదు ఏ ప్రాణికీ మనుగడ ఉండదని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు మాట్లాడారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

దాడిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు బ్రహ్మం గారి మఠం ప్రాంతానికి చెందిన దుక్కా హరీష్(26) గురువారం రాత్రి కొండపైకి వెళుతుండగా, అదే సమయంలో దారిలో ఉన్న దాసిన జయకృష్ణ, పోతిన యుగంధర్ కనిపించారు. హరీష్ వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, వాటి గురించి అడిగారు. ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని హరీష్ చెప్పగా, కోపంతో హరీష్‌ను జయకృష్ణ గట్టిగా పట్టుకోగా యుగంధర్ తన చేతికి ఉన్న కడియంతో దాడి చేశాడు. దీంతో హరీష్‌కు ముక్కు మీద గాయం అయింది. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ మహానందీశ్వరస్వామికి అభిషేకం చేశారు. తొలుత నందీశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర స్వామివారి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు పాలనా విధానాలపై అవగాహన పెంపొందించుకుని భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై జాతీయ స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని, మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు. విద్యార్థులు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో పాలనా విధానంపై నైపుణ్యాన్ని కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే క్రమశిక్షణతో కూడిన పాలనా విధానాన్ని అలవరుచుకోవాలని కోరారు. విద్యార్థులకు పాలనా వ్యవహారాలపై అవగాహన కల్పించే దిశగా ఇటువంటి సదస్సులు దోహదపడతాయని చెప్పారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్‌పై సావనీర్ బుక్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, బీబీఏ విభాగాధిపతి శ్రావణ్ కుమార్, ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ చిత్ర యూనిట్ సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రజాకార్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర విజయోత్సవంలో భాగంగా గవర్నర్‌పేటలోని అప్సర థియేటర్ వద్దకు చిత్ర యూనిట్ చేరుకుంది. యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. దర్శకుడు యాట సత్యనారాయణ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన వాస్తవ ఘటనలను తెరకెక్కించినట్లు తెలిపారు. నిజాం హయాంలో జరిగిన అకృత్యాలను చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించామన్నారు. రజాకార్ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోందన్నారు. చిత్రాన్ని ప్రజలు బాగా ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలను ఆదరిస్తారనడానికి రజాకార్ చిత్రమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నటీనటులు ఇంద్రజ, రాజ్ అర్జున్, అనసూయ భరద్వాజ్, సహ నిర్మాత పోతిరెడ్డి అంజిరెడ్డి, పంపిణీ సంస్థ భువనేశ్వరి పిక్చర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.